క్లుప్తంగా

రిత్విక్‌రెడ్డికి పార్టీ నాయకుల నివాళులు



భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

కనిగిరిరూరల్: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో చదువుకుంటున్న కనిగిరి మండలం చాకిరాలకు చెందిన కళ్లు రాఘవరెడ్డి కుమారుడు కే రిత్విక్ రెడ్డి (21) రెండురోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రిత్విక్ రెడ్డి భౌతిక కాయాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఈమేరకు రిత్విక్ రెడ్డి భౌతిక కాయాన్ని ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి, సూరసాని నర్సారెడ్డి, గంజి వెంకటేశ్వర్లు, గొల్లపల్లి సర్పంచ్ గోడి నారాయణరెడ్డి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కళ్లు శ్రీనులు సందర్శించి, పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కనిగిరి ఈఈ బాధ్యతల స్వీకరణ



ఆర్ ఉమాకాంత్, ఈఈ

కనిగిరిరూరల్: విద్యుత్ శాఖ కనిగిరి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఆర్ ఉమాకాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కనిగిరి డీఈఈగా విధులు నిర్వహించిన ఉమాకాంత్ ఉద్యోగోన్నతిపై కనిగిరిలోనే ఈఈగా నియమితులయ్యారు. ప్రస్తుతం కనిగిరి ఈఈగా విధులు నిర్వహిస్తున్న వీరయ్య ఒంగోలు టెక్నికల్ ఈఈగా బదిలీపై వెళ్లారు. ఈమేరకు పలువురు విద్యుత్ కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు నూతన ఈఈ కి ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు.

గ్రంథాలయంలో చదవడం నాకిష్టం



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

టంగుటూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం నాకిష్టం కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహకులు గుమ్మడి వర్ధనరాజు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు చక్కగా పాల్గొని గ్రంథాలయంలో పుస్తకాలు, హిందీ పద్యాలు చదివారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను విధిగా గ్రంథాలయానికి పంపించాలన్నారు. పాఠకులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనృసింహస్వామి ధ్వజారోహణ



ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

మద్దిపాడు: లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ అర్చకులు నారాయణ మారుతీచార్యులు అఖిలాండ కోటి బ్రంహాండ నాయకుడిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం ఎదరు వేదమంత్రోచ్ఛరణల మధ్య ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాముల వారి ప్రతిమలను పల్లకిపై ఉంచి మేళతాళాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు. శ్రీకంఠ భవాని ప్రసాద్, సుబ్బారావు,శ్రీహరి, వినయ్‌లు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఈఓ నర్రా నారాయణరెడ్డి, ప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటాల కోసమే ఏఐటీయూసీ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు యాసిన్

టంగుటూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై అవలంభిస్తున్న విధానాలు సరికావని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. ఆదివారం ఏఐటీయూసీ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి గద్దల బాలకోటయ్య అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రంగాల్లో కార్మికులను భాగస్వామ్యలను చేసి పోరాడి పోగొట్టుకున్న చట్టాలను తిరిగి సాధించాలన్నారు. నియోజకవర్గస్థాయిలో మరిన్ని యూనియన్లను స్థాపించి కార్మికులను పోరాటాలకు సంసిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు యాసిన్, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

నువ్వు చల్లకుండ !





మట్టి కుండలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

- పేదోడి ఫ్రిజ్‌కు పెరిగిన డిమాండ్
- మట్టి కుండలో నీటితో ఆరోగ్యం
- అందుబాటు ధరలో లభ్యం

కనిగిరిరూరల్:

ఈ ఏడాది వేసవి తన ప్రతాపాన్ని గతేడాది కంటే ఎక్కువగా చూపిస్తుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేసవి తాపం పెరిగింది.. దాహార్తి తీవ్రంగా ఉంది. పేదోడి ఫ్రిజ్‌గా పిలవబడే మట్టి కుండలకు గిరాకీ పెరిగింది. ప్రస్తుత కాలంలో చల్లని నీటి కోసం తహతహలాడే ప్రజలు ఫ్రిజ్, ఐస్ వాటర్ నీటిని తాగితే రోగాలు కొని తెచ్చుకున్నట్లేనని వైద్య నిపుణులు చెప్తున్నారు. సహజ సిద్ధమైన చల్లదనాన్ని ఇచ్చే. నీటిలోని హానికర బ్యాక్టీరియా, వైరస్‌లను లేకుండా శుభ్రపరిచే మట్టికుండ నీరే శ్రేయస్కరమని వైద్యులు వెల్లడిస్తున్నారు. దీంతో ఇంత కాలం మట్టి కుండల వైపు కన్నెత్తి చూడని వారు సైతం రక రకాల మట్టికుండల కొనుగోలుకు పరుగులు పెడుతున్నారు.

ఎన్నో ప్రయోజనాలు..

సహజ సిద్ధంగా మట్టి కుండలోని నీరు తాగడం ఆర్యోగానికి ఎంతో మేలు. అందువల్ల ప్రజలు వాటి వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. మండుతున్న ఎండల్లో తిరిగి అలసటతో ఇంటికి చేరుకున్నప్పుడు ఓ గ్లాసు మట్టి కుండలో నీరు తాగితే ఎంతో ఊరట లభిస్తోంది. ఎంతో ఖరీదైనా ఫ్రిజ్‌లున్నా ధనవంతులు సైతం నేడు మట్టి కుండలో నీటిని తాగేందుకు ఇష్టపడుతున్నారంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికీ కొందరు గ్రామీణ ప్రాంతాల్లో మట్టి కుండల్లోనే వంటలు వండుకుంటున్నారు. ఫ్యాషన్ పేరితో మట్టి పాత్రల వినియోగం తగ్గించి రోగాల బారిన పడుతున్నారనేది నగ్న సత్యం. అల్యూమినియం, స్టీల్ పాత్రల్లో సిద్ధం చేసిన ఆహార పదార్థాలతో పాటు ఫ్రిజ్‌లలో నీటిని తాగే వారు అనార్యోగాలకు గురవుతున్నారనడంలో సందేహం లేదు.

రేడియేషన్‌తో ఆర్యోగానికి చేటు..

మారుతున్న కాలానుగుణంగా వాతావరణంలోను విపరీతమైన మార్పులు వచ్చాయి. సెల్ టవర్లు, ఏసీలు, కంప్యూటర్లు, టీవీలు, ఫ్రీజ్‌లు, ఓవెన్‌లు, సెల్ ఫోన్లు తదితర రేడియేషన్ ఉత్పత్తి చేసే పరికరాల మధ్య యాంత్రిక జీవనానికి మనుషులు అలవాటు పడ్డారు. దీని వల్ల అనేక దుష్పరిణామాలు ఉన్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరం రేడియేషన్‌కు గురైతే దీర్ఘ కాలిక వ్యాధుల బారిన పడక తప్పదని తెలిపారు.

పెరిగిన మట్టి కుండల అమ్మకాలు..

గత వారం రోజుల నుంచి ఉష్ణోగ్రత తీవ్రత పెరగడంతో కుండల కొనుగోలు దారుల సంఖ్య పెరిగింది. కుండల అమ్మకపు దారులు తెనాలి, పలమనేరు తదితర ప్రాంతాల నుంచి కుండలు దిగుమతి చేసి.. వివిధ రకాల ఆకృతులు కల్గిన కుండలను స్థానిక కోర్టు సెంటర్ (కనిగిరి కందుకూరు రూట్‌లో) అమ్మకాలు చేస్తున్నారు. నియోజకవర్గ, రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కనిగిరికి వివిధ గ్రామాల నుంచి వచ్చే గ్రామీణులు, పట్టణ ప్రజలు కుండల కొనుగోళ్లకు ఆసక్తి పెంచారు. దీంతో అమ్మకపు దారులు కుండల అమ్మకాల రేట్లు కూడా పెంచారు. గతేడాది రూ.300 ఉన్నా చిన్న కుండను ఇప్పుడు రూ.350, గతంలో రూ. 350 ఉన్న కుండను ప్రస్తుతం రూ.400 అమ్ముతున్నారు. కుండలో నీటిని తాగడం ద్వారా దప్పిక తీరడంతో పాటు, ఆల్కలైన్ లక్షణాలు నీటి పీహెచ్ స్థాయిని సమతుల్యం చేస్తాయని వైద్యులు చెప్తడటంతో మట్టి కుండలకు గిరాకీ పెరిగింది. దీంతో ప్రతి రోజు 20 నుంచి30 కుండలకు పైగా అమ్మకాలు జరుగుతున్నాయని, మూడు, నాలుగు నెలలు అమ్మకాలు జరుగుతాయని విక్రయదారులు తెలిపారు.



మట్టి కుండల అమ్మకాలు

> **మట్టికుండలో నీరు ఎంతో మంచిది..**
>
> 
>
> మట్టి కుండలో ఉంచిన నీటిని తాగే ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మట్టికుండలో నీటిలో పోషక విలువలు ఉంటాయి. దీని వల్లన ఒంట్లో వేడి తగ్గుతుంది. జలుబు, దగ్గు వంటివి దరి చేరవు. ఫ్రిజ్‌లో నీటిని ఎక్కువగా తాగడం వలన ఆరోగ్య, పళ్ల సమస్యలు అధికంగా వచ్చే అవకాశం ఉంది. మట్టికుండలో నీరు చల్లదనంతో పాటు.. ఆరోగ్యానికి మేలు. నీటి పీహెచ్ స్థాయిని సమతుల్యం చేస్తుంది. ఫ్రిజ్‌లో నీళ్ల తాగడం నోటిలో లాలాజలం ఉత్పత్తి తగ్గి.. నోరు ఎండిపోతుంది. అతిగా ఫ్రీజ్ వాటర్ తాగితే నోటి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది.
>
> – డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, దంత వైద్యుడు

పాపం.. పచ్చ పత్రికల ఆర్భాటం



నరసింహశ్రేష్టి అడితి సెంటర్‌లో అరకొరగా పనులు చేసిన దృశ్యం



పోలీసు స్టేషన్ సెంటర్‌లో రోడ్డు మార్జిన్‌లో వదిలిన కంకరరాళ్లు

- ట్రంకురోడ్డు మెరుస్తోందని రాతలు
- అతుకులు వేసిన రహదారి అద్దంలా ఉందని రాతలు

సింగరాయకొండ: పాపం కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమవుతున్నా.. పచ్చ పత్రికలు మాత్రం జాకీలు పెట్టి మరీ ప్రచారం కల్పిస్తున్నాయి. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి డివైడర్‌కు ఇరువైపులా రోడ్డుకు పడిన గుంతలకు అతుకులను కాంట్రాక్టర్ ఉచితంగా వేశారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇటీవల రోడ్డుకు ఇరువైపులా పడ్డ గుంతలకు లక్షలాది రూపాయల నిధులు మంజూరయ్యాయని ఈ నిధులతో గుంతలు పూడ్చటంతో రోడ్లు అద్దాల్లా ఉన్నాయని దీంతో రాకపోకలకు వీలుగా ఉందని పచ్చపత్రికలు ఊదరగొట్టాయి. కాని అధికారులు మాత్రం ఈ గుంతలను ఉచితంగా మాత్రమే వేశారని వీటికి ఎటువంటి నిధులు మంజూరు కాలేదని ధ్రువీకరిస్తున్నారని ప్రజలు తెలియజేస్తున్నారు. గత జనవరిలో ఇలాగే ఉచితంగా రోడ్లపై పడ్డ గుంతలను తారు, సన్నకంకరతో అతుకులు వేశారు. కాని వెంటనే కురిసిన వర్షానికి ఒక్క రోజులోనే వేసిన తారు, కంకర లేచిపోయి మరల గుంతలు ఏర్పడ్డాయి. కాని ఇప్పుడు మరల ఉచితం అని వేస్తున్నారని ఉచితంగా చేసిన రోడ్డు పనులు నాసిరకంగా ఉన్నాయి. సక్రమంగా గుంతలు పూడ్చలేదని, కొన్ని చోట్ల అయితే గుంతలు అలాగే ఉన్నాయని, మరికొన్ని చోట్ల గుంతలలో అక్కడక్కడ తారు, కంకర వేసిన మిశ్రమాన్ని వేసి వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు రోడ్డు మరమ్మతులకు తెచ్చిన పెద్ద కంకరరాళ్లు రోడ్డుపై వదిలివేయటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని మొత్తం మీద ప్రచారం ఎక్కువ పని తక్కువ అన్న చందంగా ఉందని ప్రజలు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

> దీనిపై ఆర్ అండ్ బీ ఏఈ మాధవరావును వివరణ కోరగా మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పనులకు నిధులు మంజూరు కాలేదన్నారు. ఆ రోడ్డు పనులు ఉచితంగా కాంట్రాక్టరు చేస్తున్నాడని అయితే ఊళ్లపాలెం-వేములపాడు రోడ్డు మరమ్మతులకు సుమారు రూ.2 లక్షల వరకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నిధులతో ఓవీ రోడ్డు గుంతలను పూడ్చటంతో పాటు ఉత్తర, దక్షిణ పై ఓవర్ మలుపుల వద్ద గుంతలను పూడ్చామని ఆయన వివరించారు.

గిట్టుబాటు ధరలో ప్రభుత్వం విఫలం

కొండపి: ప్రజా సమస్యలు పరిష్కరించాలని.. ప్రభుత్వాలు ఎన్నికల నాడు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరుతూ ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు అన్నారు. మిట్టపాలెంలో ఆదివారం సీపీఎం కార్యకర్తలు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మంచినీరు, డ్రైనేజీ సౌకర్యం లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతి ఇంటి ముందు మురుగునీటి కుంటలు ఉండి దోమల విపరీతంగా పెరిగి అనేక వ్యాధులకు దారి తీస్తున్నాయని ప్రజలు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. దళితవాడలో మరీ దారుణంగా రోడ్లు కాలువలు ఏకమై కనిపిస్తున్నాయని తెలిపారు. బడ్జెట్లో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తగిన స్థాయిలో పంచాయతీలకు నిధులు కేటాయించాలని ఆయన కోరారు. తాళ్లూరు మండలం వెలుగువారి పాలెం వద్ద సాగర్ కెనాల్‌కు శాశ్వత లాకులు ఏర్పాటు చేసి మూసికి నీరు లింకు చేయడం ద్వారా చీమకుర్తి, సంతనూతలపాడు, కొండపి, టంగుటూరు మండలాల్లోని అనేక గ్రామాల ప్రజలకు సాగు,తాగునీటి సౌకర్యం లభిస్తుందని అన్నారు. మద్దిపాడు మండలాల్లోని ప్రజానీకానికి కొంత నీటి సమస్య తీరుతుంది అని అన్నారు. కార్యక్రమంలో కంకణాల రమాదేవి, మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, నాయకులు వందనం, అంగలకుర్తి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇంటి ముందు నిలిచిన మురుగును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పాకల బీచ్‌లో మందుబాబుల హల్‌చల్

- భయాందోళన చెందుతున్న పర్యాటకులు



పాకల బీచ్‌లో పర్యాటకుల సందడి

సింగరాయకొండ: పాకల బీచ్‌లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా పర్యాటకులు సముద్రస్నానం చేస్తూ సందడిగా గడిపారు. మెరైన్ పోలీసులు పర్యాటకులను సముద్రంలోకి ఎక్కువ దూరం వెళ్లవద్దని అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ తీరం వెంబడి పర్యాటకులను అప్రమత్తం చేశారు. సెలవు దినం కావడంతో మండలంతో పాటు చుట్టు ప్రక్కల మండలాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు.

తీరంలో మద్యం ప్రియుల అలజడి..

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బీచ్‌లో నిర్మాణ దశలో ఉన్న రెస్టారెంట్ మద్యం ప్రియులకు, పేకాట రాయుళ్లకు అడ్డాగా మారింది. ఈ రెస్టారెంట్ వద్ద జూదరులు పేకాట ఆడుకుంటూ సందడిగా గడిపారు. మద్యం ప్రియులు బహిరంగంగా మద్యం సేవిస్తూ సేదతీరారు. బీచ్ వద్ద మోటారు సైకిల్ తో మద్యం ప్రియుడు చేసిన ఫీట్స్ చూపరులను భయాందోళన కలిగించాయి. మద్యం మత్తులో మోటారుసైకిల్‌ను అదుపు చేయలేక పడేశాడు.



బీచ్‌లో మోటారుసైకిల్ పై కూర్చొన్న మద్యం ప్రియుడు

ఏపీ పంచాయతీ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎంపిక



ఏకగ్రీవంగా ఎంపికయిన సభ్యులు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని యూటీఎఫ్ భవనంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం సమితి యూనిట్స్ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కందుకూరు, కొండపి, ఉలవపాడు సమితిల ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా షేక్ మహబూబ్‌బాషా, గౌరవ అధ్యక్షుడిగా బొజ్జ శ్రీనివాసరావు, సెక్రటరీగా కోట నవీన్‌కుమార్, ట్రెజరర్‌గా పానుగోటి శ్యాంసన్, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మాజీ జిల్లా అధ్యక్షుడు వై పోలయ్య వ్యవహరించారు. అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానం చేశారు.

వంగవీటి రంగా విగ్రహావిష్కరణ

టంగుటూరు: వంగవీటి మోహన రంగా చిరస్మరణీయుడని సాంఘిక శాఖ మంత్రి డోలా బాలా వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. మండలంలోని జయవరం గ్రామంలో వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని ఆదివారం మంత్రి స్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా రంగా కీర్తిప్రతిష్టలు విస్తరించాయి.. పేదలు, కార్మికులందరిని చేరదీసి అండగా రంగా ఉండేవారన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ దద్దాల

నాయకులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలి

- అక్రమ కేసులు, అరెస్టులు మాని పాలనపై దృష్టి సారించాలి
- కూటమి ప్రభుత్వంపై నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల ధ్వజం

పామూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయించేందుకు ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా దద్దాల మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాడు ఎన్నికల సమయంలో కేవలం అధికారమే పరమావధిగా సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు బూటకపు హామీలు ఇచ్చారని దుయ్యబట్టారు. మొదటి సంతకం పెట్టిన ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ నేటికి ప్రారంభం కాక అవహేళనగా మారిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం నేటికి కార్యరూపం దాల్చలేదన్నారు.

నాయకులు, కార్యకర్తలు సంఘటితంగా ఉండాలి..

అదేవిధంగా రైతులకు రూ.20 వేలు సాయం అందిస్తామన్న హామీకూడా నీటిమీద రాతలుగానే మిగిలిందన్నారు. నిరుద్యోగ భృతి ఊసేలేదని, మహిళలకు రూ.1500 ఆర్థిక సాయం వంటి హామీలు బూటకపు హామీలుగా మారాయని కూటమి నాయకులు తప్పుడు కేసులు, అరెస్టులు మాని పాలనపై దృష్టి సారించాలని హితవుపలికారు. నాడు వైఎస్సార్ సీపీ హయంగా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటమేరకు ప్రతి హామీని అమలు చేస్తూ పేదలకు అండగా నిలిచారన్నారు. పార్టీని బలపరిచేందుకు పార్టీ మండల కమిటీలు, గ్రామస్థాయి కమిటీలు త్వరితగతిన ఏర్పాటుచేయాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, కోఆప్షన్ నాయబ్‌రసూల్, కల్లూరి రామిరెడ్డి, అంబటి కొండారెడ్డి, గట్లా విజయబాస్కర్‌రెడ్డి, మైనారిటీసెల్ అధ్యక్షుడు షేక్ గయాజ్, ఎస్టీసెల్ అధ్యక్షుడు శ్రీరాం శ్రీను, జొన్నలగడ్డ గోవిందయ్య, కోదూరి రామసుబ్బారెడ్డి, టీ మహబూబ్‌బాషా, పిరికిటి వెంకటనారాయణ, ఎలికా అచ్చయ్య, మన్నం మాధవ, బారా షరీఫ్, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణ, యూత్ అధ్యక్షుడు వీ రాజశేఖర్‌రెడ్డి, స్వర్ణ ఏడుకొండలు, ఈర్ల శ్రీను, మితికాల బాలక్రిష్ణ, శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరాయకొండలో బిల్ కలెక్టర్ చేతివాటం

- డబ్బులు వసూలు చేస్తున్న వైనం



సింగరాయకొండ గ్రామ పంచాయతీ కార్యాలయం

సింగరాయకొండ: ఇంటిపన్ను రశీదులో పేరు మారాలంటే నజరానా ఇవ్వాల్సిందేనని సింగరాయకొండ పంచాయతీ బిల్ కలెక్టరు శ్రీనివాసరావు డిమాండ్ చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల గ్రామంలోని ఈధ్గమిట్టలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన కోవూరి వెంకట సుబ్బారెడ్డి అనే వ్యక్తి వద్ద ఇంటిపన్ను రశీదులో అతని భార్య పేరు మారుస్తానని రూ.10 వేలు వసూలు చేశాడు. కాని నెలరోజులైనా కూడా పేరు మారకపోవడంతో ఇటీవల పంచాయతీ కార్యాలయానికి వచ్చి పంచాయతీ కార్యదర్శి జగదీష్ వద్ద పంచాయతీ పెట్టాడు. అంతేకాక బాధితుడు సుబ్బారెడ్డి మంత్రి నారా లోకేష్ పీఏతో పంచాయతీ కార్యదర్శి జగదీష్‌కు కూడా ఫోన్ చేయించాడు. దీంతో చివరికి జగదీష్ సూచనలతో బిల్ కలెక్టర్ శ్రీనివాసరావు వెంటనే 10 వేలను సుబ్బారెడ్డి ఫోన్ పేకు చెల్లించాడు. ఇంటిపన్ను రశీదులో పేరు మారాలంటే వెంటనే జరగదని కొంత సమయం పడుతుందని కావున త్వరలో రశీదులో పేరు మారుస్తానని కార్యదర్శి జగదీష్ బుజ్జగించి సుబ్బారెడ్డిని పంపించాడు.

చాలా మంది బాధితులు..

దీనిపై సుబ్బారెడ్డి మాట్లాడుతూ గతంలో నేను ఇంటిపన్ను కడితే రశీదు కూడా ఇచ్చారని కాని తరువాత సంవత్సరం రెండు సంవత్సరాలు కట్టాలంటూ డిమాండ్ నోటీసు ఇచ్చారని దీనిపై తాను రోజులబడి తిరిగితే చివరకు పన్ను కట్టినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. నా లాగే చాలామంది ఇంటిపన్ను బాధితులు ఉన్నారని వీరు రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని సుబ్బారెడ్డి ఆరోపించారు. తరువాత ఈ విషయం తెలిసిన టీ కొట్టు యజమాని నేను కూడా ఇంటి పన్ను రశీదులో పేరు మార్చాలని రూ.30 వేలు ఇచ్చానని కార్యాలయానికి రావడంతో అతనికి కూడా డబ్బులు తిరిగి ఇచ్చాడని సిబ్బంది తెలియజేస్తున్నారు. ఇదిలా ఉంటే తోపుడు బండ్ల వద్ద వ్యాపారపు పన్ను రూ.1000 కట్టించుకోవాల్సి ఉండగా రూ.1100 కట్టించుకున్నాడని తోపుడు బండ్ల వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఈ విధంగా పంచాయతీలో బిల్ కలెక్టర్‌తో పాటు సిబ్బంది చేతివాటంపై సమగ్ర విచారణ జరిపాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం



కమ్మవారిపాలెంలో ఆర్థికసాయం అందజేస్తున్న ఇన్‌చార్జ్ దద్దాల, నాయకులు



కంబాలదిన్నెలో వార్డు సభ్యురాలికి నగదు అందజేస్తున్న ఇన్‌చార్జ్ దద్దాల, హుసేన్‌రెడ్డి

- కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం
- నగదు పంపిణీ చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల

పామూరు: వైఎస్సార్ సీపీ ప్రతి కార్యకర్తకు పార్టీ, నేను ఎప్పుడు అండగా ఉంటామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రం పామూరుతోపాటు మండలంలోని గ్రామాల్లో ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పర్యటించి ఇరువురికి ఆర్థిక సాయం అందజేశారు. ఈసందర్భంగా మండలంలోని కమ్మవారిపాలెం (కొత్తపల్లి) గ్రామానికి వెళ్లిన ఆయన ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త మేళింగి దావీదు కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారికి దద్దాల రూ. 20 వేలు, పార్టీ మండలాధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి రూ.10 వేలు నగదును అందజేశారు. అదేవిధంగా కంబాలదిన్నె గ్రామంలో ఇటీవల ప్రమాదానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న పార్టీ వార్డు సభ్యురాలు నీలం కొండమ్మను పరామర్శించిన దద్దాల రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగాసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, ఎంపీటీసీ పోలినేని శ్రీనివాసులు, కో-ఆప్షన్ నాయబ్‌రసూల్, అంబటి కొండారెడ్డి, కే.రామిరెడ్డి, గట్లా విజయభాస్కర్ రెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్.గయాజ్, ఎస్టీసెల్ శ్రీరాం శ్రీనివాసులు, మిరియం పరమేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, యూత్ అధ్యక్షుడు వాకమళ్ల రాజశేఖర్‌రెడ్డి, స్వర్ణ ఏడుకొండలు, రైతు విభాగం అధ్యక్షుడు పోలక సిద్దారెడ్డి, ఈర్ల శ్రీను, జే.గోవిందయ్య, పి.వెంకటనారాయణ, కే.రామసుబ్బారెడ్డి, టీ మహబూబ్‌బాషా, మితికల బాలక్రిష్ణ, ఎలికా అచ్చయ్య, మన్నం మాధవ, బారాషరీఫ్, నారాయణరెడ్డి, శ్రీను, శ్యామల సాంబిరెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, దేవిరెడ్డి వెంకటస్వామిరెడ్డి, పూలక సిద్దయ్య, మేళంగి ఇస్రాయేలు, జి.నారాయణరెడ్డి పలువురు పాల్గొన్నారు.

లక్ష్మయ్యను పరామర్శించిన దద్దాల

వెలిగండ్ల(కనిగిరిరూరల్): కాలికి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంట్లో ఉన్న రాళ్లపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కడెం లక్ష్మయ్యను ఆదివారం వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, సర్పంచ్ గోనా జేమ్స్, ఎంపీటీపీ గిద్దా బ్రహ్మయ్య, పార్టీ నాయకులు గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సైకం స్వర్ణ ఏడుకొండలురెడ్డి, పాలా సుబ్రహ్మణ్యం, తాతపుడి సురేష్, ఎలికా నారాయణ, కుప్పన బోయిన వెంకటరామయ్య, ముక్క వెంకటేశ్వర్లు, కాకర్ల వెంకటేశ్వర్లు, గిద్దా తిరుపతయ్య, గంగయ్య, నడిపి నారాయణ, గోనా సుదర్శన్, బాల సిద్దయ్య, నాగార్జున, మితికాల వెంకటేశ్వర్లు, గురుస్వామి, నారాయణ, మధు, జీ నారాయణ, నన్నసాని నారాయణ, ఈర్ల శ్రీను, కంటు కేశవ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే హక్కుల సాధన



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి

కొండపి: మహిళా దినోత్సవ స్ఫూర్తితో మహిళలు సమానత్వం సమాన హక్కులు సాధన కోసం ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపు నిచ్చారు. పెరిదేపి గ్రామంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మహిళా దినోత్సవ స్ఫూర్తితో అటువంటి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా మండల ఉపాధ్యక్షురాలు విశ్రాంత, మండల కార్యదర్శి మాధవి, సంపూర్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.